క్లుప్తంగా

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



రాజుపాలెం: రెండుమూడు రోజుల పాటు వరుసగా జ్వరం ఉంటే వెంటనే దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి వెళ్లి రక్త పరీక్షలు చేయించుకోవాలని సత్తెనపల్లి సబ్‌యూనిట్ అధికారి చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని చౌటపాపాయపాలెంలో సీజనల్ వ్యాధులపై గ్రామస్తులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రహదారులలో మురుగునీరు నిల్వ ఉన్నచోట బ్లీచింగ్ చల్లించారు. నీరునిల్వ ఉన్న తొట్టెల్లో ఎబెట్ చల్లారు. గృహాల సమీపంలో తాగేసిన కొబ్బరిబొండాలు, పాతటైర్లను ఉంచుకోరాదని తెలిపారు. కూలర్లలో నీటిని వారానికొకసారి మార్చుకోవాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ మల్లేశ్వరికి సత్కారం



పెదకూరపాడు: ప్రజల పక్షాన నిలిచే ఉద్యోగి ప్రజల గుండెల్లో ఉంటారని పెదకూరపాడు గ్రామ సర్పంచ్ గుడిపూడి రాజు అన్నారు. పెదకూరపాడు ఎంపీడీఓ మల్లేశ్వరి ఎన్నికల విధులలో భాగంగా ముదినేపల్లి మండలం నుంచి బదిలీపై పెదకూరపాడు వచ్చారు. అనంతరం బదిలీలో భాగంగా సొంత మండలానికి వెళ్తున్న సందర్భంగా మల్లేశ్వరి సన్మానసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గుడిపూడి రాజు, గారపాడు సర్పంచ్ మేడా రమణ మాట్లాడుతూ మల్లేశ్వరి మండలంలో ఎన్నికలను సమర్థంగా నిర్వహించారన్నారు. కార్యదర్శులు, సర్పంచ్‌లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదర్శ డ్రైవర్లకు సత్కారం



సత్తెనపల్లి: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో విధులు నిర్వహిస్తూ విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన ముగ్గురు ఆదర్శ డ్రైవర్లను డిపో మేనేజర్ జీఎస్‌వీవీ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం సత్కరించారు. అత్యధిక కేఎంపీఎల్ సాధించిన షేక్ హితయాధుల్లా(ఈ–729252), షేక్ మీరావాలి(ఈ–729759) ఇరువురు డ్రైవర్లు, జూలై నెలలో ఆరుసార్లు కేఎంపీఎల్ సాధించిన పీఎస్ నారాయణ(ఈ–727486) డ్రైవర్లను పూలమాలతో సత్కరించి నగదు బహుమతి అందించారు. ముగ్గురు డ్రైవర్లను మిగిలిన ఉద్యోగులు ఆదర్శంగా తీసుకొని అత్యధిక కేఎంపీఎల్ సాధించాలన్నారు. సూపర్‌వైజర్లు, ఉద్యోగులు, అసోసియేషన్ నాయకులు, పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

నకరికల్లు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10గంటలకు సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు కార్యాలయం సూపరింటెండెంట్ కె.కృష్ణనాయక్ సోమవారం తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష ఉంటుందన్నారు. అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్ణీత సమయానికి హాజరుకావాలని సూచించారు.

మహిళలూ.. రక్తహీనత బారిన పడకండి

చిలకలూరిపేట: మహిళలు రక్తహీనత బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని ఒయాసిస్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు డాక్టర్ కందిమళ్ల జయమ్మ చెప్పారు. ఒయాసిస్ సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని కేజే ఆసుపత్రిలో రక్తహీనత పై అవగాహన సదస్సు, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తహీనత బారిన పడకుండా ప్రతిరోజూ పౌష్టికాహారం, అవసరమైనప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

రొంపిచర్ల: మండలంలోని విప్పర్ల గ్రామం వద్ద ఆదివారం రాత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి ఎక్స్‌ప్రెస్ హైవేపై జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. విప్పర్ల సెంటర్‌లో నందిగం ప్రభుదాసు రోడ్డు దాటుతుండగా అదే మార్గంలో వస్తున్న లారీ ఢీకొట్టింది. ప్రభుదాసు కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. గాయాలైన ప్రభుదాసు మండలంలోని కొత్తపల్లి గ్రామవాసి. క్షతగాత్రుడిని 108 వాహనంలో నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడు. రొంపిచర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామాల అభివృద్ధిపై దృష్టిపెట్టాలి

సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ ప్రసాద్

రాజుపాలెం: గ్రామాల అభివృద్ధిపై సర్పంచ్‌లు దృష్టి పెట్టాలని ఎంపీడీఓ రామకృష్ణ ప్రసాద్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు గ్రామ పంచాయితీల అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభించారు. తొలుత జాతిపిత గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా గ్రామ పంచాయతీలో సమావేశాలు ఏర్పాటు చేసుకుని గ్రామాన్ని అభివృద్ధి పరుచుకోవాలని తెలిపారు. గ్రామంలోని ప్రతీ రహదారిలో విద్యుత్ దీపాలు వెలిగే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. డంపింగ్ యార్డుల నిర్వాహణ చేపట్టాలని సూచించారు. మూడు రోజుల పాటు శిక్షణా కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఈఓపీఆర్డీ పగడాల ముక్కంటి, ఎంఈఓ మల్లిఖార్జునశర్మ, ట్రైనర్ బొల్లయ్య, ఏపీఓ సీహెచ్ వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణప్రసాద్



క్రోసూరులో శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఇన్‌చార్జి ఎంపీడీఓ స్వరూపరాణి, సర్పంచులు

క్రోసూరులో...

క్రోసూరు: గ్రామాల్లో పంచాయతీ అధికారులు, సర్పంచ్‌లు పారిశుద్ధ్యంపై ఎప్పటికప్పుడు శ్రద్ధవహించి చర్యలు చేపట్టాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ స్వరూపరాణి అన్నారు. క్రోసూరు మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు పారిశుద్ధ్యం, వ్యర్థాల నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ స్వరూపరాణి రిసోర్సు పర్సన్‌గా వ్యవహించారు. ఎంపీపీ పి.కోటయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో ప్రభుత్వం నిర్దేశించిన పనులు ఏవిధంగా పనిచేయాలనే అంశంపై శిక్షణనిచ్చారు. ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ వెంకయ్య, కార్యదర్శులు ఆదినారాయణ, క్రోసూరు సర్పంచ్ మల్లా చందమామ, దొడ్లేరు సర్పంచ్ ముక్కు అంజలి, కార్యదర్శులు పీవీ రమేష్, రత్నాకర్, జయప్రకాశ్, చందునాగశేషగిరి తదితరులు పాల్గొన్నారు.

పెదకూరపాడులో..

పెదకూరపాడు: గ్రామ సర్పంచులు, కార్యదర్శులు గ్రామాల సమగ్ర అభివృద్ధికి దోహదపడ్డాలని ఎంపీడీఓ మల్లేశ్వరి కోరారు. పెదకూరపాడు మండల పరిషత్ కార్యాలయంలో మూడు రోజులు గ్రామ సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ తరగతులను ఎంపీడీఓ మల్లేశ్వరి ప్రారంభించారు.ఈ సందర్భంగా శిక్షకులు గ్రామంలో పారిశుద్ధ్యం, వీధీ దీపాలు నిర్వహణ, రోడ్లు అభివృద్ధి, ప్రజల సమస్యలపై అవగాహన కల్పించారు. ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరావు మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను గ్రామాభివృద్ధికి తోడ్పడుతాయని అందరు సర్పంచులు హాజరుకావాలని కోరారు.

నకరికల్లులో...

నకరికల్లు: గ్రామాభివృద్ధిలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలని టీఓటీలు కె.అప్పారావు, శైలేంద్రకుమార్‌లు సూచించారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు మూడురోజుల శిక్షణ తరగతులను సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణకు స్పందన కరువు...

ముప్పాళ్ళ: మండల పరిషత్ కార్యాలయంలో గ్రామపంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై సోమవారం ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి స్పందన కరువైంది. అధికారుల ఉదాసీన వైఖరితో పాటుగా సరైన సమాచారం అందివ్వకపోవటంతో హాజరు కావాల్సిన ప్రజాప్రతినిధులు గైర్హాజరయ్యారు. మొత్తం 14 గ్రామ పంచాయతీలకు గాను కేవలం ఏడుగురు సర్పంచ్‌లు మాత్రమే హాజరయ్యారు. ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శుల మధ్యే శిక్షణ కార్యక్రమం ముగించారు. రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీల అభివృద్ధికి తీసుకోవాల్సిన అంశాలపై ప్రణాళికలు తయారు చేసేందుకు గాను మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. మొదటి రోజు శిక్షణకు సగం మందితోనే మమ అనే రీతిలో కార్యక్రమం ముగించారు. తహసీల్దార్ ఎం.భవానిశంకర్, ఈఓపీఆర్డీ రూపవతిలు పాల్గొని పంచాయతీల ప్రణాళిక తయారీపై అవగాహన కల్పించారు.

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు

- ఈనెల 16 నుంచి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు
- తహసీల్దార్ శ్రీనివాస చక్రవర్తి



గ్రామ రెవెన్యూ అధికారులు, సర్వేయర్లతో సమీక్ష చేస్తున్న తహసీల్దార్ శ్రీనివాస చక్రవర్తి

సత్తెనపల్లి: భూ సమస్యల పరిష్కారానికే ఈనెల 16 నుంచి 30 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందని సత్తెనపల్లి తహసీల్దార్ కె.శ్రీనివాస చక్రవర్తి పేర్కొన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో సోమవారం గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులకు, ఎన్జీఓలకు, బ్యాంకర్స్‌కు గ్రామసభ గురించి ముందుగా తెలియజేయాలన్నారు. గ్రామసభ నిర్వహించే సమయంలో గ్రామ పటం, ఆర్ఎస్ఆర్, ఎఫ్ఎంబీ, ఎల్ఆర్ కాపీ, ఆన్‌లైన్ చేసిన అడంగల్, వన్ బి రిజిస్టర్, ప్రభుత్వ భూములు తెలిపే రిజిస్టర్, రీ సర్వే –ఆర్ఎల్ఆర్, డీఎల్ఆర్, ఆర్ఓఆర్, గ్రామసభ నిర్వహించే విధానం నమోదు చేయుటకు (మినిట్స్) లాంగ్ నోట్‌బుక్, రెండు కంప్యూటర్లు (ల్యాప్‌టాప్), రెండు సిమ్‌లతో కూడిన డాంగిల్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు.

– ఈ నెల 16వ తేదీన పెద్దమక్కెన, 17న గుడిపూడి, 20న నందిగామ, 22న కంటేపూడి, 24న కొమెరపూడి, 27న లక్కరాజుగార్లపాడు, 29న కంకణాలపల్లి, 31న ధూళిపాళ్ల, సెప్టెంబర్ 3న బృగుబండ 5న పాకాలపాడు, 6న రెంటపాళ్ల, 10న అబ్బూరు, 12న ఫణిదం, 13న బట్లూరు, 17న కట్టమూరు, 19న గోరంట్ల, 21న భీమవరం, 24న సత్తెనపల్లి, 26న వడ్డవల్లి లో గ్రామ సభలు జరుగుతాయన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రామసభ నిర్వహించడం జరుగుతుందన్నారు. ముందుగా దండోరా ద్వారా గ్రామ ప్రజలకు తెలియ చేయాలన్నారు. ఈ సందర్భంగా గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లకు పలు సూచనలు చేశారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ రాజేంద్రప్రసాద్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆదినారాయణ, మండల సర్వేయర్ విజయ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

అంబేడ్కర్ విగ్రహంపై దాడి అమానుషం



రెంటపాళ్లలో కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

- సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలి
- రెంటపాళ్లలో కొవ్వొత్తులతో ప్రదర్శన

సత్తెనపల్లి: విజయవాడ నడిబొడ్డులో ఉన్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహంపై టీడీపీ మూకల దాడి అమానుషమని సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పెండెం బాబురావు, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిలుకా జైపాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల గ్రామంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం పై విగ్రహ శిలాఫలకాన్ని, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరును తొలగించడంపై నల్లబ్యాడ్జిలు ధరించి మహిళలు పెద్దఎత్తున సోమవారం రాత్రి కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ. 430 కోట్లతో అతి పెద్ద విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్నారు. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్‌ల ప్రోద్బలంతో పసుపు మూకలు విగ్రహాన్ని ధ్వంసం చేయడానికి ప్రయత్నించారని విమర్శించారు. రాజ్యాంగ శిల్పిపై కూడా కక్ష సాధింపులు చేయడం సరైన విధానం కాదన్నారు. అధికారంలో ఉన్న వారి ప్రోద్బలంతోనే విగ్రహ ధ్వంసానికి పాల్పడ్డారన్నారు. సామాజిక అభ్యున్నతి కోసం దళిత వర్గాల తలరాతలు మార్చిన మహనీయుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుంటే ఇంత దారుణానికి ఒడిగడతారా అని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ ప్రజలంతా ముక్తకంఠంతో ఈ ఘటనను ఖండించాలని, ఘటన పై సమగ్ర విచారణ జరిపి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ముందుగా గ్రామంలో మహిళలు పెద్ద ఎత్తున ముందుకు వచ్చి కొవ్వొత్తులతో ప్రదర్శన చేపట్టారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు ఏకుల పెద్దమత్తయ్య, పల్లె. గాబ్రియల్, పైర్ల వెంకటేశ్వర్లు, తాటిమళ్ళ వెంకట్రావు, జెర్రిపోతు ఇస్మాయిల్, సాతులూరి లక్ష్మణరావు, వలపర్ల లక్ష్మణరావు, గుడిపూడి చంద్రయ్య, జంగిలి ఏసోబు, ఏకుల మరియదాసు, పైర్ల ఏసురత్నం, ఏకుల రాణి, కట్టా రమాదేవి, కట్టా శకుంతల రాజు,మహిళలు, తది తరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత



ఆర్వో వాటర్ సిస్టమ్‌ను పరిశీలించి సూచనలు చేస్తున్న జడ్జి సీహెచ్‌వీఎన్ శ్రీనివాసరావు

సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్‌వీఎన్ శ్రీనివాసరావు

సత్తెనపల్లి: బాల్య వివాహాలను అరికట్టడం అందరి బాధ్యతని, బాల్యవివాహాల నిర్మూలనలో అందరూ భాగస్వామ్యులు కావాలని సత్తెనపల్లి మండల న్యాయసేవాధికార కమిటీ చైర్మన్, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) సత్తెనపల్లి సీహెచ్ వెంకట నాగశ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో గల కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని న్యాయమూర్తులు సోమవారం సందర్శించారు. సరుకులు నిల్వ చేసే గదిని, వంటశాలను పరిశీలించారు. అక్కడ తయారైన పదార్థాలను పరిశీలించారు. ఆర్వో వాటర్ సిస్టం పనిచేయకపోవడాన్ని గమనించిన న్యాయమూర్తి వెంటనే దానికి మరమ్మతులు చేయించాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. అక్కడ ఉన్న విద్యార్థినులను న్యాయమూర్తులు వారికి అందుతున్న సదుపాయాలు, వసతులు గురించి అడిగి తెలుసుకున్నారు. పలు ముఖ్యమైన చట్టాలపై వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధాన సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) తౌషిద్ హుస్సేన్, సత్తెనపల్లి రూరల్ సీఐ పి.శ్రీనివాసరావు, పట్టణ ఎస్ఐ ఎం.సంధ్యారాణి, విద్యార్థినులు ఉన్నారు.

పని సర్దుబాటును వెంటనే రద్దుచేయాలి

క్రోసూరు: రాష్ట్రప్రభుత్వం చేపట్టిన ఉపాధ్యాయుల పనిసర్దుబాటు విధానాన్ని వెంటనే రద్దు చేయాలని ఎస్టీయూ ఏపీ నేతలు సోమవారం డిమాండ్ చేశారు. ఈసందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు సాతులూరి రాఘవ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోని వచ్చిన వెంటనే 117 జీఓను రద్దు చేస్తామని హామీ ఇచ్చిందని, అయితే దాన్ని రద్దుచేయకపోగా, ఇప్పుడు పని సర్దుబాటు పేరిట ఉపాధ్యాయులను ఇబ్బందిపెట్టే పనికి శ్రీకారం చుట్టిందన్నారు. అదేవిధంగా ఉపాధ్యాయులకు రావలసిన ఆర్థిక బకాయిలను వెంటనే విడుదల చేయాలని, పీఆర్సీని వెంటనే ప్రకటించాలని, లేకుంటే ఐఆర్ ప్రకటించాలని, ముఖ్యంగా జీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పంట నమోదు చేయించుకోవాలి

మాచవరం: రైతులు పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని ఏఓ రామమ్మ తెలిపారు. మండలంలోని గంగిరెడ్డిపాలెం గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో రైతులకు అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని, కౌలు రైతులు కౌలు రైతు కార్డులను పొంది పంట నమోదు చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు.

శిథిలావస్థలో పోలీసు క్వార్టర్స్



అమరావతి: మండల కేంద్రమైన అమరావతిలోని పోలీసు క్వార్టర్స్‌లో కనీస వసతులు కల్పించకపోవటం, శిథిలావస్థకు చేరటంతో అద్దెలు ఎక్కువయినా.. ఇక్కడ ఉండలేక పోలీసు కుటుంబాలు వేరే చోటకి తరలిపోయాయి. సుమారు పదిహేనేళ్లక్రితం ఎనిమిది కుటుంబాలు నివాసముండే విధంగా నిర్మించిన ఈ క్వార్టర్స్‌కు కనీసం గ్రామ పంచాయతీ తాగునీరు అందే పరిస్థితిలేదు. సుమారు రెండు ఎకరాల స్థలంలో కొంత భాగంలోనే పోలీస్ సిబ్బంది నివాసముండేందుకు క్వార్టర్స్ నిర్మించారు. మిగిలిన భాగం ఖాళీగా ఉండటంతో పిచ్చి మొక్కలు మొలిచి విష పురుగులకు స్థావరాలుగా మారాయి. అలాగే మంచినీటి సరఫరా లేక పోవటంతో బోరుపంపు నుంచి ఉప్పునీటిని వాడుకోవాల్సిరావటం, మోటారు తరచు రిపేర్లు రావటం జరుగుతుంది. క్వార్టర్స్ ఆవరణ మొత్తం రోడ్డు కంటే పల్లంగా ఉండటంతో వర్షం కురిస్తే వర్షం నీరు నిల్వ ఉంటుంది. ఆవరణకు ప్రహరీ లేక పోవడంతో పశువులు, పందులు క్వార్టర్స్ ఆవరణలోనే తిరుగుతున్నాయి. ప్రస్తుతం ఉన్న క్వార్టర్స్‌లో ఎనిమిది మంది సిబ్బంది, సీఐ నివాసముండే అవకాశం ఉన్నప్పటికి శిథిలావస్థకు చేరి పెచ్చులూడి పడతుండటంతో ప్రస్తుతం ఇక్కడ ఎవరు నివాసం ఉండటం లేదు. ప్రస్తుతం సిబ్బంది పెరగటంతో ప్రస్తుతమున్న క్వార్టర్స్‌కు మరమ్మతులు చేయించి అన్ని వసతులు కల్పించటంతో పాటుగా ఖాళీ స్థలంలో అదనంగా క్వార్టర్స్ నిర్మిస్తే బయట ప్రాంతాల్లో పెరిగిన అద్దెలు చెల్లించలేక సతమతమవుతున్న పోలీసు కుటుంబాలకు ఊరట లభించే అవకాశం ఉంటుంది.

పంట నమోదు పరిశీలన



క్రోసూరు: మండలంలోని బయ్యవరం గ్రామంలో వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ- పంట నమోదు కార్యక్రమాన్ని సోమవారం మండల వ్యవసాయాధికారి వేణుగోపాల్ పర్యవేక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024–25 సంవత్సరానికి సంబంధించి రైతులు ఖరీఫ్ సీజన్‌లో సాగు చేస్తున్న పంటల వివరాలు ఈ–పంట యాప్ ద్వారా వ్యవసాయ, రెవెన్యూ అధికారులు సంయుక్త సహకారంతో నమోదు చేస్తున్నారని తెలిపారు. ఈ–పంట ప్రయోజనాలు అవగాహన చేసుకుని రైతులు రైతు భరోసా కేంద్రంలోని సిబ్బంది, రెవెన్యూ సిబ్బందిని కలిసి తమ పంట వివరాలు తెలియచేయాలన్నారు. ఆర్బీకే సిబ్బంది కె.గ్రేస్ ప్రసన్న, ఎన్.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

పత్తి పంట ధ్వంసంపై కేసు

పెదకూరపాడు: మండలంలోని జలాల్‌పురం గ్రామానికి చెందిన పాటిబండ్ల మాలతికి చెందిన పత్తి పంటలను 15 సెంట్లు మేరకు అరకతో ధ్వంసం చేసినట్లు వచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకట్రావు తెలిపారు. చిన్నయ్యతో పాటు మరో నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

రైతన్నా.. జర భద్రమన్నా..!

- వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు అధికంగా జరిగే అవకాశం
- నిర్లక్ష్యం చేస్తే అంతే సంగతులు
- మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద మరమ్మతుల విషయంలో జాగ్రత్తలు తప్పనిసరి

సత్తెనపల్లి: వానాకాలం వచ్చిందంటే చాలు విద్యుత్ ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తుంటాయి. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా దాని ఫలితం తీవ్రంగా ఉంటుంది. అందుకే ఈ సీజన్‌లో ప్రజలు ముఖ్యంగా రైతులు విద్యుత్ వినియోగంలో జాగ్రత్తలు పాటించాలి. ప్రస్తుతం విద్యుత్‌తో కాలువలు, బోర్ల కింద మోటార్లు వినియోగించి పంటలను సాగు చేస్తున్నారు. ఈ సమయంలో మోటార్ల వినియోగంలో రైతులు జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాల బారిన పడకుండా ఉండొచ్చు. పంట పొలాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రైతులు చిన్న చిన్న మరమ్మతులు చేస్తుండడంతో ప్రమాదాలు జరుగుతుంటాయి.



సత్తెనపల్లిలోని విద్యుత్ సబ్‌స్టేషన్

చేయకూడని పనులు...

- వర్షం పడుతున్న సమయంలో విద్యుత్ స్తంభాలను తాకకూడదు
- నీటిలో పడిన విద్యుత్ వైర్ల జోలికి వెళ్లకూడదు.
- భవనిర్మాణ పనులు చేసేటప్పుడు విద్యుత్ వైర్లకు దూరంగా ఉండాలి
- తడిచేతులతో, తడి బట్టలతో విద్యుత్ పరికరాలు ముట్టుకోకూడదు, మరమ్మతులు చేయవద్దు
- పిల్లలకు అందే ఎత్తులో స్విచ్ బోర్డులు ఉంచరాదు.
- స్తంభం, ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర మూత్ర విసర్జన చేయరాదు.

రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- విద్యుత్ స్తంభం నుంచి వ్యవసాయ మోటారుకు మధ్య ఎక్కువ దూరం ఉండకుండా చూసుకోవాలి
- మోటారు పనిచేయని సమయాల్లో చేతితో దానిని తాకకూడదు. టెస్టర్‌ను ఉపయోగించి మాత్రమే పరీక్షించాలి.
- విద్యుత్ స్తంభం నుంచి మోటారుకు కరెంటు నేరుగా సరఫరా కాకుండా మధ్యలో ఫీజు వేయాలి. మోటర్ వద్ద ఫీజులు, ఇండికేటర్ బల్బులు, స్టార్టర్‌ను ఒక చెక్క పై బిగించుకోవాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇనుప డబ్బాపై బిగించకూడదు.
- విద్యుత్ సరఫరాలో లోపం ఉంటే మెకానిక్‌తో మరమ్మతులు చేయించుకోవాలి. పరిజ్ఞానం లేకుండా సొంతంగా మోటార్‌ను ముట్టుకోవద్దు.

జాగ్రత్తలు పాటించాలి

వర్షం పడుతున్నప్పుడు టీవీ, ఫ్రిజ్, కంప్యూటర్ల స్విచ్‌లు ఆఫ్ చేయాలి. లేకుంటే వైర్లు షార్టు సర్క్యూట్ అయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా రైతులు విద్యుత్ సమస్యలు ఉంటే సొంతంగా మరమ్మతులు చేయకూడదు. సంబంధిత లైన్‌మెన్, సిబ్బందికి తెలియచేయాలి

–రాజశేఖర్ బాబు, ఏడీఈ, సత్తెనపల్లి

యువతి అదృశ్యంపై కేసు నమోదు

సత్తెనపల్లి: యువతి అదృశ్యంపై సత్తెనపల్లి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సత్తెనపల్లి మండలం కొమెరపూడి గ్రామానికి చెందిన ఓ యువతికి, అచ్చంపేట మండలం ఓర్వకల్లు గ్రామానికి చెందిన ఓ యువకుడితో సోమవారం వివాహం జరగాల్సి ఉంది. ఈ క్రమంలో యువతి అదృశ్యం కావడంతో ఆమె తండ్రి సత్తెనపల్లి రూరల్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు యువతి అదృశ్యం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.